


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
03-12-2025
పేజీలు: 02



# యూరప్‌కు పుతిన్ తీవ్ర హెచ్చరిక

యూరప్ దేశాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. "మేం యుద్ధం కోరుకోవడం లేదు. కానీ యూరప్ కనుక యుద్ధాన్ని ప్రారంభించాలని అనుకుంటే.. దానికి మేం సంసిద్ధంగా ఉన్నాం" అని ఆయన స్పష్టం చేశారు. యూరోపియన్ నేతలు శాంతి చర్చల్లో రష్యాకు ఆమోదయోగ్యం కాని డిమాండ్లను చొప్పించి, ఉక్రెయిన్ సంక్షోభంపై శాంతి అంగీకారాన్ని అడ్డుకుంటున్నారని పుతిన్ ఆరోపించారు. ట్రంప్ శాంతి ప్రణాళిక సవరణలపై చర్చించడానికి అమెరికా రాయబారులు మాస్కో చేరుకున్న వేళ పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# గంభీర్‌కు రవిశాస్త్రి హెచ్చరిక




టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోంది. స్వదేశంలో రెండు టెస్టు సిరీస్‌లు కోల్పోవడం.. ఈ విమర్శలకు దారి తీసింది. భారత క్రికెట్ చరిత్రలో సొంతగడ్డపై వైట్‌వాష్ అయిన తొలి కోచ్‌గా గంభీర్ నిలిచాడు. ఇది మరింత ప్రతికూలతను తెచ్చిపెట్టింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ రవి శాస్త్రి గంభీర్‌కు ఓ స్పష్టమైన హెచ్చరికతో పాటు ఓ కీలక సూచన చేశాడు. 'నీ పనితీరు బాగాలేదు అంటే.. ఉద్యోగం పోయే ప్రమాదం తప్పదు. అన్నింటినీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ముఖ్యంగా ఇలాంటి సమయాల్లో ఓర్పు అవసరం. కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్ స్కిల్స్ కీలకం. జట్టు గెలవాలంటే.. నువ్వు ఆటగాళ్లను ప్రోత్సహించాలి. మేము కోచ్‌గా ఉన్నప్పుడు అదే చేశాం. జట్టును గెలిపించాలంటే నువ్వు ఒత్తిడికి గురి కాకూడదు. పనిని ఆస్వాదించగలగాలి' అని రవిశాస్త్రి గంభీర్‌కు సూచించాడు. గంభీర్ ప్రధాన కోచ్‌గా నియమితుడైన తర్వాత టీమిండియా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ 2025 ట్రోఫీల్లో ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా కైవసం చేసుకుంది. కోచ్‌గా గంభీర్ విఫలమని చెప్పడం సరికాదు! స్వదేశంలో వరుసగా రెండు టెస్టు సిరీస్‌ల్లో భారత్ వైట్‌వాష్‌కు గురి కావడంతోనే విమర్శలు మొదలయ్యాయి. గంభీర్ ముక్కుసూటితనం వీటికి మరింత ఆజ్యం పోసింది. ఈ క్రమంలోనే వెటరన్ ప్లేయర్లు రోహిత్ శర్మ-విరాట్ కోహ్లీ, గంభీర్ మధ్య మంచి సంబంధాలు లేవని అనేక వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. జట్టులో అంతర్గత వాతావరణం ప్రశాంతంగా లేదనే ప్రచారం నడుస్తోంది. గంభీర్‌కు ఇది కూడా ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ప్రస్తుతం గౌతీ ముందున్న అతిపెద్ద సవాలు.. 2026 టీ20 ప్రపంచ కప్. స్వదేశంలో జరగనున్న ఈ టోర్నీలో టీమిండియా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది.



9 ఏళ్ల బాలుడు దేవవ్రత మహేష్ రేఖేపై

# ప్రధాని మోదీ ప్రశంసలు


తొమ్మిదేళ్ల బాలుడు వేదమూర్తి దేవవ్రత మహేష్ రేఖే సాధించిన అద్భుతమైన ఘనతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కాశీ నగరంలో ఈ బాలుడు ప్రదర్శించిన అసాధారణ ప్రతిభను, రాబోయే తరాలు సైతం గుర్తుంచుకుంటాయని ఆయన కొనియాడారు. కాశీ ఎంపీగా అతని ఘనత పట్ల గర్విస్తున్నానని తెలిపారు.దేవవ్రత కేవలం 50 రోజుల వ్యవధిలో, ఎలాంటి ఆటంకాలు లేకుండా శుక్ల యజుర్వేదంలోని మధ్యందిని శాఖకు చెందిన 2000 వేద మంత్రాలను దండక్రమ పారాయణం రూపంలో పూర్తి చేశాడు. ఎన్నో పవిత్ర శ్లోకాలను, పదాలను దోషరహితంగా పఠించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ అద్భుత ప్రతిభపై స్పందించిన ప్రధాని, భారతీయ సంస్కృతిని ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ బాలుడి పట్ల గర్వపడతారని అన్నారు. దేవవ్రత మన గురు పరంపరకు నిలువెత్తు నిదర్శనమని ప్రశంసించారు."కాశీ ఎంపీగా, ఈ పవిత్ర నగరంలో ఈ అద్భుతం జరగడం నాకు చాలా సంతోషంగా ఉంది. దేవవ్రత కుటుంబ సభ్యులకు, అతనికి మద్దతుగా నిలిచిన సాధువులు, పండితులు, సంస్థలకు నా ప్రణామాలు తెలియజేస్తున్నాను" అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. ఈ చిన్న వయసులోనే దేవవ్రత సాధించిన ఘనత దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



# సమత్రా దీవులను మరోసారి వణికించిన భూకంపం

ఇండోనేషియాని మరోసారి భారీ భూకంపం వణికించింది. సుమత్రా దీవుల్లో బుధవారం ఉదయం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.4గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం ఉన్నట్లు తెలిపింది. కాగా, సమత్రా దీవుల్లో భూకంపం సంభవించడం వారం రోజుల వ్యవధిలోనే ఇది రెండోసారి కావడం గమనార్హం. గత నెల 27వ తేదీన కూడా అక్కడ భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.3గా నమోదైంది. భూకంప కేంద్రం ఆషే ప్రావిన్స్‌కు సమీపంలో భూ ఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతున నమోదైంది. సైక్లోన్ సెన్యార్ కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆ దేశాన్ని ఇలా వరుస భూకంపాలు వణికించడం ఆందోళన కలిగిస్తోంది. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్‌కు సమీపంలో ఉన్నందున ఇండోనేషియాలో వరుస భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, సునామీలు తరచుగా సంభవిస్తుంటాయి.

# పెన్షనర్లకు భారీ ఊరట



కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు భారీ ఊరట లభించింది. ఇటీవల వీరికి సంబంధించి ఎన్నో వార్తలు, ఊహాగానాలు వచ్చాయి. 8వ వేతన సంఘం సిఫార్సుల్లో.. పెన్షన్ సవరణ అంశం లేదని.. దీనికి సంబంధించి విధివిధానాల్ని ప్రస్తావించలేదని ప్రచారం జరిగింది. ఇప్పుడు దీనిపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. 8వ వేతన సంఘం విధివిధానాలపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసినప్పటి నుంచి.. ఎన్నో ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల యూనియన్లు.. ప్రధాని నరేంద్ర మోదీ సహా కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖలు రాశారు. 8వ వేతన కమిషన్ విధివిధానాల్ని సవరించాలని.. పెన్షన్ రివిజన్ (సవరణ) టాపిక్ కూడా చేర్చాలని కోరాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ.. డిసెంబర్ 2న రాజ్యసభలో క్లారిటీ ఇచ్చేసింది. 8వ వేతన సంఘం వీటిన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటుందని.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ సవరణ కూడా ఉంటుందని స్పష్టం చేసింది. దీంతో అన్ని అనుమానాలు పటాపంచలయ్యాయని చెప్పొచ్చు. పార్లమెంటులో ఎంపీలు జావేద్ అలీ ఖాన్, రామ్‌జీ లాల్ సుమన్.. పై వాటి గురించి ప్రస్తావిస్తూ ప్రశ్నించగా.. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ స్పందించారు. 8వ వేతన సంఘం కింద పెన్షన్ సవరణను ఎందుకు ప్రతిపాదించలేదని క్వశ్చన్ చేశారు. దీనిపై బదులిచ్చిన చౌదరీ.. 8వ వేతన కమిషన్ అన్ని అంశాలకు సంబంధించి సిఫార్సులు చేస్తుందని చెప్పారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ ఉంటాయని పేర్కొన్నారు. జావేద్ అలీ ఖాన్, సుమన్ మరో ప్రశ్న కూడా సంధించారు. ప్రస్తుత డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం), డియర్‌నెస్ రిలీఫ్‌ను (DR).. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తక్షణ ఉపశమన చర్యగా.. బేసిక్ పేలో ప్రభుత్వం విలీనం చేస్తుందా అని ప్రశ్నించారు. దీనికి కూడా బదులిచ్చిన పంకజ్ చౌదరీ.. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వానికి దీనిపై ఎలాంటి ప్రతిపాదన లేదని వెల్లడించారు. సాధారణంగా డీఏ 50 శాతం దాటితే.. బేసిక్ పేలో విలీనం చేస్తుంటారు. ఈ క్రమంలోనే 2024 జనవరిలోనే డీఏ 50 శాతం అధిగమించగా.. అప్పుడే పలు ఉద్యోగ సంఘాలు.. డీఏను బేసిక్ పేలో విలీనం చేయాలని కేంద్ర ఆర్థిక శాఖకు లేఖ రాశాయి. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల ప్రకటన రాలేదు.

# ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై భగ్గుమంటున్న బీజేపీ నేతలు

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై భగ్గుమంటున్నారు బీజేపీ నేతలు. మూడు కోట్ల హిందు దేవతలున్నారని ఒక్కొక్కరు ఒక్కో ఓదేవుడిని నమ్ముతారని, అన్ని రకాల దేవుళ్లు ఉన్నట్టే కాంగ్రెస్ పార్టీలో అన్ని రకాల వ్యక్తులు ఉన్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. దేవుళ్లపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా.. బుధవారం (డిసెంబర్ 03) నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది భారతీయ జనతా పార్టీ. అసలు రేవంత్ ఏమన్నారు..? బీజేపీ నేతల అభ్యంతరం ఏంటి..? హిందు దేవుళ్లపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని తెలంగాణ BJP చీఫ్ రాంచందర్ రావు అన్నారు. హిందువులు మూడు కోట్ల మంది దేవుళ్ళను పూజిస్తారని, ఇంత మంది దేవుళ్లు ఉన్నారా? అని రేవంత్ మాట్లాడుతున్నారని రాంచందర్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌కి మజ్లీస్ పార్టీ దేవుళ్ళను విమర్శించే దమ్ముందా? ప్రశ్నించారు రాంచందర్‌రావు. హిందువులకు సంబంధించిన దేవీదేవతలను అవహేళన చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఒక హిందువుగా ఉంటూ, హిందువుల మీద, దేవీదేవతల మీద రేవంత్‌రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. MIM సహవాస దోషం వల్లే రేవంత్ రెడ్డి ఈ విధంగా మాట్లాడుతున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో హిందువులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. ఏ ఓట్లతో అయితే రేవంత్‌రెడ్డి అధికార పీఠమెక్కి మాట్లాడుతున్నారో..అదే ఓట్లతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలన్నారు.






# సై అంటే సై అంటోన్న తండ్రీకొడుకులు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి రాష్ట్రంలో జరుగుతున్నసర్పంచ్ ఎన్నికల్లో చాలా మంది ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అంటున్నారు.పెద్దవాళ్లతోపాటు ఈ సారి యూత్ ఎక్కువగా పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపిస్తుండటం విశేషం. అయితే సాధారణంగా ఎన్నికలు వచ్చిన సందర్భంలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు అభ్యర్థులుగా పోటీలో నిలవడం చూస్తుంటాం. మెదక్ జిల్లాలో కూడా అలాంటి పోటీనే ఉండబోతుంది. తండ్రీకొడుకులు సర్పంచ్ పదవికి పోటీ పడుతూ వార్తల్లో నిలిచారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్ గ్రామంలో సర్పంచ్ స్థానానికి తండ్రి మానెగళ్ళ రామకృష్ణయ్య నామినేషన్ వేశాడు. మరోవైపు అతని కొడుకు వెంకటేష్ కూడా అదే సర్పంచ్ స్థానానికి తండ్రికి ప్రత్యర్థిగా నిలబడి ఔరా అనిపిస్తున్నాడు. మిగిలిన అభ్యర్థుల పోటీని అటుంచితే.. ఈ ఇద్దరు తండ్రీ కొడుకులు మాత్రం సర్పంచ్ నువ్వా..నేనా..? సై అంటే సై అన్నట్టుగా బరిలోకి దిగి అందరిలో ఉత్కంఠ రేకెత్తిస్తున్నారు. మరి ఇద్దరు ఎవరు ఓటర్ల మనస్సు గెలుచుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

## ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం..

# మిల్స్ కాలనీలో ఘటన

వరంగల్ జిల్లా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువకుడు ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో వేల్పుల కమల్ అనే యువకుడు కిరాణా షాప్ నిర్వహిస్తుంటాడు. ఈ నెల రెండవ తేదీ రాత్రి కిరాణా దుకాణంలో సరుకులు కొనేందుకు వెళ్లిన 8 ఏళ్ల బాలికను లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించాడు.ఆ సమయంలో దుకాణానికి వేరే వారు రావడంతో పాప బయటికి పరిగెత్తుకుంటూ వెళ్లి వచ్చి విషయం తల్లిదండ్రులకు తెలిపింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## మూడేళ్లుగా సినిమాలకు

# దూరం


తెలుగు, హిందీ సినీరంగాల్లో అందం, అభినయంతో ఆకట్టుకున్న తారలు చాలా మంది ఉన్నారు. కేవలం ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్స్ అయిన హీరోయిన్స్ ఉన్నారు. అయితే ఫస్ట్ మూవీతో ఓ రేంజ్ క్రేజ్ వచ్చినప్పటికీ ఆ తర్వాత అవకాశాలు అంతగా రాని ముద్దగుమ్మలు ఉన్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ మాత్రం సరైన సక్సెస్ కోసం కొన్నాళ్లపాటు ఎదురుచూసింది. అయినా ఎలాంటి బ్రేక్ రాలేదు. దీంతో నెమ్మదిగా సినిమాలకు దూరమైపోయింది. ఆమె వెండితెరపై కనిపించి మూడేళ్లు అవుతుంది. కానీ ఇప్పటికీ ఏమాత్రం క్రేజ్ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె సినిమాల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అందం, అద్భుతమైన నటనతో మెప్పించినప్పటికీ.. ఈ అమ్మడుకు అదృష్టం కలిసి రాలేదు. గ్లామర్ షోలతో కుర్రకారుకు మెంటలెక్కించిన ఈ వయ్యారి ఎవరో తెలుసా.. ? సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ ఈ బ్యూటీకి రోజు రోజుకి ఫాలోవర్స్ పెరిగిపోతున్నారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# అలియా హాట్ లుక్స్

అలియా భట్ లేడీ గూఢచారిగా నటించిన ఈ యాక్షన్ డ్రామాలో వామికా గబ్బి మరో ప్రధాన పాత్ర పోషించగా బాబీ డియోల్ విలన్ గా నటిస్తున్నాడు. పోస్ట్ పోన్ కు కారణం అధికారికంగా చెప్పలేదు కానీ గ్రాఫిక్స్ కు సంబంధించిన అవుట్ పుట్ అంత సంతృప్తికరంగా రాకపోవడంతో పాటు స్టోరీ పరంగా తలెత్తిన కొన్ని లోపాలు సరిచేయడానికి టైం అవసరం కావడంతో వాయిదా వేశారని ముంబై టాక్. ఇదంతా వార్ 2 ప్రభావమే అంటున్నారు. ఒకవేళ వార్ 2 కనక బ్లాక్ బస్టర్ అయ్యుంటే అల్ఫా చెప్పిన టైంకే వచ్చేది. పఠాన్ 2, టైగర్ వర్సెస్ పఠాన్ కు రంగం సిద్ధమయ్యేది. కానీ ఇప్పుడివన్నీ పెండింగ్ లో పడుతున్నాయి. సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ లు సైతం ఈ కొనసాగింపుల పట్ల ఏమంత ఆసక్తిగా లేరట. ఎంతసేపూ ఒకే తరహా విలన్ ని పెట్టి కేవలం ఆర్టిస్టులను మార్చుకుంటూ కథలు చెబుతున్న విధానం క్రమంగా ఫేడ్ అవుట్ అవుతుందని గుర్తించారు కాబోలు. ఆదిత్య చోప్రా మాత్రం ఇప్పుడప్పుడే స్పై వరల్డ్ మీద ఆశలు వదులుకునేలా లేరట.





# నాటి సర్పంచ్‌లే నేటి ఎమ్మెల్యేలు

చట్టసభల్లో రాణించాలంటే సర్పంచ్ పీఠం లెర్నింగ్ స్టేజ్.. ఒకప్పుడు సర్పంచ్‌లుగా వారి గ్రామాల అభివృద్ధికి బాటలువేసిన ఆ నేతలు ఇప్పుడు ఎమ్మెల్యేలుగా శాసనసభలో గళమెత్తుతున్నారు.. గ్రామంలోని రచ్చబండలో రాణించి ఇప్పుడు MLA లుగా ఆ నియోజకవర్గాలను శాసిస్తున్నారు.. సర్పంచ్ అభ్యర్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఆ ఎమ్మెల్యేలు ఎవరూ..! సర్పంచ్ నుంచి ఏ విధంగా చట్టసభల్లోకి అడుగుపెట్టారు.. అనే వివరాలను ఈ కథనంలో తెలుసుకోండి.. గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు.. గ్రామాలు బాగుంటే దేశం బాగుంటుంది.. గ్రామాలను పాలించే ప్రథమ పౌరుడు నిజాయితీగా పాలించి ప్రజల చేత ప్రశంసలు పొందగలితే వారికి రాజకీయ అవకాశాలు కూడా అలాగే వెతుక్కుంటూ వస్తాయి..

ఒకప్పుడు సర్పంచ్ లుగా గ్రామ అభివృద్ధికి బాటలు వేసిన ఈ నేతలు అవకాశాలు అందిపుచ్చుకుని ఇప్పుడు MLA లు అయ్యారు.. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని భూపాలపల్లి MLA గండ్ర సత్యనారాయణరావు.. ఒకప్పుడు గ్రామ సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన వారే.. గండ్ర సత్యనారాయణరావు స్వగ్రామం గణపురం మండలం బుద్దారం.. 1984 నుండి 1989 వరకు బుద్దారం గ్రామ సర్పంచిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.. ప్రజల చేత ప్రశంసలు పొందిన గండ్ర ఆ తర్వాత 1996లో గణపురం జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు.. అనంతరం తెలుగుదేశం పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. రెండు పర్యాయాలు MLA గా పోటీచేసి ఓటమిపాలైన గండ్ర సత్యనారాయణరావు పట్టువదలకుండా 2023లో కాంగ్రెస్ పార్టీ నుంచి భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందారు.. ప్రస్తుతం భూపాలపల్లి MLA గా పరిపాలనలో తన మార్క్ ప్రదర్శిస్తున్నారు.. గ్రామ సర్పంచ్ లుగా బరిలోకి దిగుతున్న నేతలకు తన అనుభవాలు పంచుతున్న ఆయన నిజాయితీగా గ్రామాల అభివృద్ధికి పాటు పడితే అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని సూచిస్తున్నారు. ప్రస్తుతం నర్సంపేట MLA గా బాధ్యత నిర్వహిస్తున్న దొంతి మాధవరెడ్డి కూడా ఒకప్పుడు గ్రామ సర్పంచ్ గా ప్రజల చేత ప్రశంసలు పొందిన వారే.. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని చెన్నారావుపేట మండలం అమీనాబాద్ ఆయన స్వగ్రామం.. 1984లో అమీనాబాద్ గ్రామ సర్పంచ్ గా గెలుపొంది తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన దొంతి మాధవరెడ్డి 1988 నుండి 2014 వరకు అమీనాబాద్ సొసైటీ చైర్మన్ గా పని చేశారు.. 1995 నుండి 2000 సంవత్సరం వరకు వరంగల్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.. 2014లో కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి మొదటిసారి MLA గా గెలిచారు. 2018 ఎన్నికలో ఓటమిపాలైన దొంతి మాధవరెడ్డి తిరిగి 2023 సాధారణ ఎన్నికల్లో మరోసారి నర్సంపేట MLA గా గెలుపొందారు.. ప్రస్తుతం నర్సంపేట MLAగా తన మార్క్ ప్రదర్శిస్తున్న దొంతి మాధవరెడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్ గా బరిలోకి దిగుతున్న నేతలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్రతి రాజకీయ నాయకుడు ఎదుగుదలకు జన్మనిచ్చిన గడ్డ తొలిమెట్టు అంటున్న ఈ ఎమ్మెల్యేలు.. స్వగ్రామంలో ప్రజల చేత ప్రశంసలు పొందినవారు కచ్చితంగా రాజకీయ రంగంలో రాణిస్తాడని.. జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో, అవకాశం దొరికితే దేశ స్థాయిలో కూడా తన సత్తా చాటుకుని ప్రజలచేత ప్రశంసలు పొందగలరని చెబుతున్నారు.

## కాశీలో దండక్రమ పారాయణం పూర్తి చేసిన
# 19 ఏళ్ల కుర్రాడు

19 ఏళ్ల యువ పండితుడు వేదమూర్తి దేవవ్రత్ మహేష్ రేఖే సాధించిన అసాధారణ ఘనత దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా ఆయన దండక్రమ పారాయణాన్ని 50 రోజుల్లోనే విజయవంతంగా పూర్తి చేశారు. ఎలాంటి ఎవరోధాలూ లేకుండా, ఎవరూ ఊహించని విధంగా 2000 మంత్రాలను పఠించి చరిత్ర సృష్టించగా.. ప్రధాని నరేంద్ర మోదీయే స్వయంగా ఈ యువకుడిని అభినందించారు.

భారతీయ సంస్కృతికి గర్వకారణం దేవవ్రత్ మహేష్ రేఖే.. శుక్ల యజుర్వేదంలోని మధ్యాంధిని శాఖకు చెందిన సుమారు 2000 మంత్రాలను ఎలాంటి అవరోధాలు లేకుండా వరుసగా 50 రోజుల్లో పఠించి దండక్రమ పారాయణాన్ని పూర్తి చేశారు. ఈ మంత్ర పఠనంలో అనేక వేద శ్లోకాలు, పవిత్ర పదాలు ఉన్నాయి. ఈ విషయాన్ని నేరుగా ప్రధాన మంత్రి మోదీయే ఎక్స్ వేదికగా వెల్లడించారు. "వేదమూర్తి దేవవ్రత్ మహేష్ రేఖే సాధించిన ఈ ఘనతను రాబోయే తరాలు తప్పకుండా గుర్తుంచుకుంటాయి. భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ యువకుడి పట్ల గర్విస్తారు" అని మోదీ పేర్కొన్నారు. దేవవ్రత్ మహేష్ రేఖే తన నియోజకవర్గమైన కాశీ (వారణాసి) పట్టణానికి చెందిన వ్యక్తి కావడం పట్ల ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. కాశీలో ఈ అసాధారణ ఫీట్‌ను సాధించడం గర్వ కారణమని అన్నారు. ఈ గొప్ప విజయాన్ని సాధించడంలో దేవవ్రత్‌కు మద్దతు ఇచ్చిన అతని కుటుంబ సభ్యులు, భారతదేశం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది సన్యాసులు, పండితులు, సంస్థలకు మోదీ తన కృతజ్ఞతలను తెలియజేశారు.

ఆధునిక భారత చరిత్రలో రెండో వ్యక్తి

మహారాష్ట్రలోని అహిల్యానగర్‌కు చెందిన దేవవ్రత్ మహేష్ రేఖే.. వేదాధ్యయనం కోసం కాశీ వెళ్లారు. వేదాలు నేర్చుకున్న తర్వాత..



శుక్ల యజుర్వేదాన్ని రాసింది చూడకుండానే.. ఏకబిగిన 50 రోజులపాటు 165 గంటలు.. 2000లకుపైగా మంత్రాలను ఆయన ఉచ్చరించారు. ఆధునిక భారతదేశ చరిత్రలో ఇలాంటి ఘనత సాధించడం ఇది రెండోసారి మాత్రమే కావడం విశేషం. దండక్రమ పారాయణం చేసిన దేవవ్రత్‌కు దండక్రమ విక్రమాదిత్య బిరుదును ప్రదానం చేశారు.

దండక్రమ పారాయణం అంటే ?

అత్యంత శక్తివంతమైన దండక్రమ పారాయణంలో నరసింహస్వామిని స్తుతిస్తారు. దండ క్రమలో.. దండ అంటే స్వీయనియంత్రణ లేదా ఏకాగ్రత, క్రమ అంటే వరుసక్రమం. పారాయణం అంటే పఠించడం. అంటే.. ఏకాగ్రతతో క్రమం తప్పకుండా మంత్రాలను పఠించడం అనుకోవచ్చు. దండక్రమ పారాయణం చేసిన వారి చుట్టూ.. ఒక బలమైన ఆధ్యాత్మిక కవచం ఏర్పడుతుందని నమ్ముతారు. ప్రతికూలతల నుంచి రక్షణకు, ధైర్యం కోసం, మనస్సు ప్రశాంతంగా ఉండటానికి; భయాలు, అవరోధాలు తొలగిపోవడానికి, సంకల్ప శక్తిని పెంచుకోవడానికి, నరసింహా స్వామి ఆశీస్సులు పొందడానికి దండక్రమ పారాయణం చేస్తారు. ఈ పారాయణం అనేది లయబద్ధంగా సాగిపోతుంది.

## రాత పరీక్షలేకుండానే ఎస్‌బీఐలో
# 996 ఉద్యోగాలు.. డిగ్రీ అర్హతతో ఎంపిక

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI).. దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ బ్రాంచుల్లో ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ (SCO) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 996 స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనుంది. అర్హత కలిగిన అభ్యర్థులు డిసెంబర్ 2వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇతర వివరాలు ఈ కింద చెక్ చేసుకోండి..

పోస్టుల వివరాలు..

వీపీ వెల్త్(ఎస్ఆర్ఎం) పోస్టుల సంఖ్య: 506

ఏవీపీ వెల్త్ (ఆర్ఎం) పోస్టుల సంఖ్య: 206

కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల సంఖ్య: 284

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అలాగే నోటిఫికేషన్‌లో సూచించిన విధంగా సంబంధిత పని అనుభవం కూడా ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి వివిధ విభాగాల్లోని పోస్టులను అనుసరించి 2025 మే 1వ తేదీ నాటికి 20 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీకి 3 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీకి 5 ఏళ్లు,




పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఈ అర్హతలు ఉన్న వారు ఎవరైనా ఆన్‌లైన్ విధానంలో డిసెంబర్ 23, 2025వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు కింద జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.750 చెల్లించవల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు. ఎలాంటి రాత పరీక్షలేకుండానే ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల తుది ఎంపిక ఉంటుంది. ఇతర వివరాలు ఈ కింది నోటిఫికేషన్‌లో చెక్ చేసుకోండి.




## 792 కోట్ల ఫాల్కన్ గ్రూప్ స్కామ్‌లో
# ఈడీ కీలక చర్యలు

భారీ మొత్తంలో ఇన్వెస్టర్లను మోసం చేసిన ఫాల్కన్ గ్రూప్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కీలక చర్యలు చేపట్టింది. సుమారు రూ.792 కోట్ల ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ స్కామ్‌లో ప్రధాన నిందితుడైన అమర్‌దీప్ కుమార్ కంపెనీకి చెందిన హాకర్ 800ఏ ప్రైవేట్ విమానాన్ని వేలం వేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఈ వేలం ద్వారా వచ్చే మొత్తాన్ని స్కామ్ బాధితులకు నష్టపరిహారంగా చెల్లించనున్నట్లు ఈడీ స్పష్టం చేసింది.ఈడీ కథనం ప్రకారం, ఫాల్కన్ గ్రూప్ పేరుతో అమర్‌దీప్ కుమార్ నకిలీ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పథకాన్ని ప్రారంభించి, అనేక మంది నుంచి రూ.792 కోట్లు వసూలు చేసి మోసం చేశాడు. ఈ కేసులో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం 2025 ఫిబ్రవరి 11న మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, వాటి ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అయితే, ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడానికి ముందే అమర్‌దీప్ కుమార్ ఇదే విమానంలో దేశం విడిచి పారిపోయినట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు.ఈ కేసులో భాగంగా ఈడీ 2025 మార్చి 7న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమానాన్ని స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఈ విమానం బేగంపేట ఎయిర్‌పోర్టులో ఉంది. డిసెంబర్ 9న ఎంఎస్టీసీ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ వేలం జరగనుంది. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 7 వరకు ఈ విమానాన్ని పరిశీలించవచ్చని ఈడీ తెలిపింది.ఈ కేసులో ఇప్పటికే అమర్‌దీప్ సోదరుడు సందీప్ కుమార్, చార్టర్డ్ అకౌంటెంట్ శరద్ చంద్ర తోష్నివాల్, కంపెనీ సీఓఓ ఆర్యన్ సింగ్ ఛాబ్రాలను ఈడీ అరెస్ట్ చేసింది. అలాగే, రూ.18.63 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. విమానం నిర్వహణ ఖర్చులు దాని విలువను మించిపోయే అవకాశం ఉన్నందున, దానిని వేలం వేయడానికి పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ నవంబర్ 20న అనుమతి ఇచ్చింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ అధికారులు తెలిపారు.




## బస్సును ఓవర్‌టెక్ చేయబోయి డివైడర్‌ను
# ఢీ కొట్టిన కారు.. ముగ్గురు మృతి

జార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బస్సును ఓవర్‌టెక్ చేసే క్రమంలో కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా.. పలువురు గాయపడ్డారు. హజారీబాగ్ జిల్లాలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. బీహార్‌కు చెందిన కొందరు పశ్చిమ బెంగాల్‌లోని ఓ వివాహ వేడుకకు హాజరై కారులో తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో బర్హి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగ్తాహి వంతెన సమీపంలోకి రాగానే బస్సును ఓవర్‌టెక్ చేసేక్రమంలో కారు డివైడర్‌ను ఢీ కొట్టింది.